# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 44 -

### - మహా ఖాళీ-

**విసుగు చెందని** విక్రమార్కుడు, మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'మార్గమధ్యంలో నీకు శ్రమ అనిపించకుండా మరో కథ చెబుతాను విక్రా! విను.' - అని బేతాళుడు ప్రారంభించాడు.

"అవాళ ఫిల్మ్ యినిస్టిట్యూట్‌లో ఆ యినిస్టిట్యూట్ డైరెక్టర్ భావప్రసాద్ కొత్త స్టూడెంట్స్‌కి నటనా విభాగంలో యింటర్వ్యూస్ చెయ్యడం మొదలెట్టారు. మొదటి కాండిడేట్ గలగలశ్రీ

'అమ్మా! గలగలా! యాక్టింగు నేర్చుకోవాలనే నీ కుతూహలానికి ప్రేరణ ఏవిటమ్మా?' అనడిగాడు భావప్రసాద్.

'పేరణకేటుంటదండీ! నాకేదన్నా తెలిత్తే ఆ పనిసేసేదాన్నండి. కానీ నాకేటీ తెల్దండి. సినేమాల్లో అన్నీ అంతా సేసిపెడతారండి. మేకప్పోడు మేకప్పు, యేసాలోడు బట్టలు, కెవీరా వోడు సాయాగరనం, రాసేవోడు మాటలు, దరిసికుడు కారెట్టరిత్తే, నిరిమాతగోడు తీసుకుంటాడండి. యికనేనేసేదేటుంటదండి. ఈ యెదవలందరితో యెలా వేక్టింగు సెయ్యాలో తవరు తరిపీదిత్తారండి. అంతా వీజీవీజీ గందా అని మీ కాడకొచ్చేనండి' అని సమాధానం చెప్పింది గలగలశ్రీ

'వెరీగుడ్! నీకు సీటు ఖాయం' అని యినిస్టిట్యూట్ డైరెక్టర్ భావప్రసాద్ ఆమెకి సీటు ఖరారు చేసేసాడు.

తరువాత కాండిడేటు పిపాసి.

'ఏవోయ్! పిపాసీ నువ్వెందుకు సినిమా నటుడు కావాలనుకుంటున్నావ్' అనడిగాడు భావప్రసాద్.

'ఏవుందండీ - హీరో అవుదామని.'

'ఎలా!'

'పీక్ హీరో పిపాసి' అనే స్క్రీన్ నేమ్ సెటప్ చేసుకున్నానండి.

'వెరీగుడ్ - ఏవున్నాలేకపోయినా ముందు బిరుదు ముఖ్యం. మరి నీ తెలుగు సంగతేవిటి?'

'వచ్చిన తెలుగు చచ్చిపోడానికి రోజూ తెలుగు సినిమాలు చూస్తున్నానండి.'

'భేష్! కానీ నీ ముఖం అద్దంలో ఎప్పుడన్నా చూసుకున్నావా? నీకెవడు హీరో వేషం యిస్తాడనుకున్నావ్'

'ఫేసు పాతరోజుల్లో కావల్సొచ్చేదండి ఈ రోజుల్లో ఫేసెందుకుసార్. చూడగా చూడగా ప్రేక్షకులు ఏ ఫేస్కైనా అలవాటు పడిపోతారండి.'

'నువ్వు చెప్పింది బాగానే వుంది. కానీ ఫేసు ప్రాబ్లమ్ కంటే ప్లేసు ప్రాబ్లమ్ యెక్కువైపోయిందిప్పుడు. రోజు రోజుకీ యెంతోమంది హీరోలు వస్తున్నారు. బిలో యావరేజ్ గాడివి నీకు యీ పోటీ పరిశ్రమలో ప్లేసు దొరకడం చాలా కష్టం. కష్టమే కాదు, యింపాసిబుల్. అన్ని వేషాలు నిండిపోయి ఏదో వొక చిన్న ప్లేసు కోసం వందలాది మహానటులు పోటీపడుతూ వెయిట్ చేస్తున్నారు. అంచేత అనవసరంగా ఆశలు పెంచుకుని కాలం వృధా చెయ్యకు. వెళ్లి ఏ టాక్సీనో, రిక్షానో తొక్కుకో. నిజానికి నువ్వందుకే పనికొస్తావనిపిస్తోంది నాకు. పాత్రలో జీవిస్తూ జీవించడం కన్నా కష్టపడి ఏదోలా జీవించు. నీకు యిక్కడ సీటిచ్చి నీ జీవితాన్ని నేను పాడు చైదల్చుకోలేదు. వెళ్లు' అని ఫిల్మ్ యిన్సిటిట్యూట్ డైరెక్టర్ భావప్రసాద్ నటపిపాసిని వెనక్కి పంపించేశాడు.

ఏళ్లు గడిచాయి. రీళ్లు తిరిగాయి. పిపాసి ఏ ట్రైనింగు తీసుకోకుండానే కష్టపడి చిన్న చిన్న వేషాలు ట్రై చేయసాగాడు. ఫిల్మ్ యినిస్టిట్యూట్ డైరెక్టర్ యెదిగి యెదిగి మహా నిర్మాత భావప్రసాదుగా మారాడు. పీక్ హీరో పిపాసి టాప్ హీరో అయ్యాడు. అతడి కాల్షీట్స్ కోసం యిండస్ట్రీలో నిర్మాతలంతా అతని యింటుముందు పడిగాపులు పడుతూ వెయిట్ చేయసాగారు.

ఓ రోజు పిపాసి పుట్టినరోజు. ఇండస్ట్రీలో అందర్నీ తన యింటికి ఆహ్వానించాడు. ఇంట్లో హాలు అతడి సినిమా రిలీజు రోజు సినిమాహాల్లో వచ్చిన సినిమా గెస్టులతో కిటకిటలాడిపోయింది. హీరో యింట్లో సోఫాలు, కుర్చీలు, కార్పెట్లు, మేడమెట్లు అన్నీ ఆహ్వానితులతో నిండిపోయాయి. అప్పుడు హడావుడిగా, యేళ్ల క్రితం పిపాసిని నటనకు పనికిరావన్న నిర్మాత భావప్రసాద్ వచ్చాడు. అతనికి కూర్చోడానికి యెక్కడా చోటు కనిపించలేదు. అలాగే నిలబడి పీక్ హీరో పిపాసికి ప్రణామం చేశాడు. పిపాసి, భావప్రసాద్ని చూసి మందహాసం చేసి కిక్కిరిసిన తన యింట్లో కూర్చోమని చోటు చూపించాడు.'

- అదీ సంగతి విక్రమార్కా! ఇప్పుడు చెప్పు. ఎక్కడా కూర్చునే స్థలం లేని తన యింట్లో పీక్ హీరో పిపాసి, నిర్మాత భావప్రసాద్కి కూర్చునే చోటు యెలా యెక్కడ చూపించాడు. ఇండస్ట్రీలో యెక్కడా ప్లేస్ లేదన్న భావప్రసాద్నిని తన ఇంట్లో ఎక్కడ ప్లేస్ చేశాడు? - నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పలేకపోయావో, నీ తల వెయ్యి చెక్కలయి, యే చెక్కకి ఎక్కడ పడాలో తెలియక చోటుకోసం తచ్చాడు నృత్యం చేస్తుంది" - అని ముగించాడు బేతాళుడు.

అందుకు విక్రమార్కుడు ' ఓ బేతాళా! పీక్ హీరో పిపాసి నిర్మాత భావప్రసాద్ని సవినయంగా తీసుకువెళ్ళి తన యింట్లో హాల్లో మెట్లన్నీ జాగర్తగా యెక్కించి పై మెట్టు మీద కూర్చోబెట్టాడు. కూర్చోబెట్టి 'మేష్టారూ! ఈ ప్రపంచంలో యెక్కడా ప్లేసు లేకపోవడం వుండదు. అన్ని ప్లేసులూ నిండిపోయినా వొక ప్లేసు మాత్రం యెప్పుడూ ఖాళీగానే వుంటుంది. అదే టాప్ ప్లేస్. అన్నిటికంటే టాప్ ప్లేస్ అనగానే నిర్మాత భావప్రసాద్ ఖిన్నుడై, వినమ్రుడయ్యాడు.

బేతాళా! యింకో విషయం. ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు డస్టిన్ హాఫ్మన్ని కూడా యాక్టింగ్ స్కూల్కి వెళ్తే అతన్ని సినిమాకి పనికిరావన్నాడు ఆ స్కూల్ డైరెక్టర్. అంతేకాదు, ఏదన్నా హోటల్లో ముఖద్వారం తెరిచే గేట్మన్గా పనికొస్తావ్ - ఆ జాబ్ ట్రై చెయ్యి. అన్నాడు. వేషాల్లేక డస్టిన్ చివరికి ఆ గేట్మన్ వుద్యోగానికే కుదురుకున్నాడు. అప్పుడు ఆ హోటల్లో బస చైడానికొచ్చిన, డస్టిన్ని నటనకు పనికిరావన్న స్కూల్ డైరెక్టర్, డోర్మన్గా వున్నా డస్టిన్ హాఫ్మన్ని చూసి, 'చూశావా - నేనారోజు చెప్పానా లేదా? నీకిదే కరెక్ట్ జాబ్ - యిండస్ట్రీలో నీకు ప్లేస్ లేదని' అని వెక్కిరించి వెళ్లిపోయాడు. తర్వాత డస్టిన్ హాఫ్మన్ మహానటుడై, ఆస్కార్ గ్రహీత అయి - ప్లేసు లేకపోవడం యెక్కడా వుండదు. అన్ని ప్లేసెస్కీ మించిన టాప్ ప్లేస్ యెప్పుడూ ఖాళీగానే వుంటుంది. అందుకే ధ్యానాగ్రం అయిన టాప్ ప్లేస్ అంటుంది.

*మన్మనా భవ మద్భక్తో*
*మద్యాజీ మాం నమస్కురు।*
*మామేవైష్యసి యుక్త్వైవమ్*
*ఆత్మానం మత్పరాయణః ॥*

అత్యంత ప్రేమగా నన్ను ధ్యానించు, నమస్కార పూజలు చేయి. నన్ను ఆశ్రయించి నన్ను అనుభవించే సమర్థమగు మనస్సును పొందు నన్ను పొందగలవు.

- అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు' - అని బదులు చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసి చిటారు కొమ్మకు చేరాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments